# తిరిగి గూటికి – ఆమినా అస్సెల్మి

( قصة المسلمة الجديدة تعود - آمنة أسِّلم )

[ తెలుగు – Telugu – تلغو ]

Santhibaata Telugu Monthly Magazine


**అనువాదం :** డాక్టర్  నాగిరెడ్డి శ్రీనివాసరావు (అబ్దుల్ కరీమ్)

**పునర్విమర్శ :** ముహమ్మద్ కరీముల్లాహ్



2010 - 1431

islamhouse.com

# ( قصة المسلمة الجديدة تعود - آمنة أسِّلم )

« باللغة التلغو »

مجلة الطريق السلمي تلغو الشهري

ترجمة: د/ ناجِردِّ سرينِواس راو (عبد الكريم)

مراجعة: محمد كريم الله

2010 - 1431

islamhouse.com

# తిరిగి గూటికి

ప్రారంభంలో చెప్పుకున్నట్లు, దైవధర్మం అనేది ఏ ఒక్కరి సొత్తో కాదు. ప్రకృతిలాగే ఇది అందరకూ చెందుతుంది. ఈ వాస్తవాన్ని ఆలస్యంగానైనా సరే చాలా మంది తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇస్లాం (శాంతి) ధర్మం ప్రపంచంలో అత్యంత వేగంతో విస్తరిస్తుంది. ఈ ధర్మంపై బురద చల్లడానికి పాశ్చాత్యులు చేస్తున్న కృషి వలన, ఈ ధర్మవ్యాప్తి తగ్గడానికి బదులు దీని వేగం మరింత పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం అమెరికాలో ప్రతీ సంవత్సరం సగటున 20,000 మంది ఇస్లాం ధర్మంలో ప్రవేశిస్తున్నారు. మన దేశంలో, మన రాష్ట్రంలో కూడా ఈ దైవ ధర్మాన్ని చాలామంది తెలుసుకుని, ఈ ధర్మంలో ప్రవేశిస్తున్నారు. ఈ ధర్మాన్ని ఆచరించడం అనేది 'మత మార్పిడి' ఎంత మాత్రం కాదు. దారి తప్పిన సోదరి లేదా సోదరుడు తిరిగి తన పయనించవలసిన దారిని చేరుకోవడం లాంటిది. ఇలా తిరిగి గూటికి చేరుకున్న ఓ సోదరి గురించి గాని, ఓ సోదరుని గురించి గాని ఈ శీర్షికలో పరిచయం చేయబడుతుంది.

ఇస్లాం ధర్మంలో అడుగిడిన వీరిని కొత్త ముస్లింలు లేదా నవముస్లింలు లేదా నౌ ముస్లింలుగా అభిమానంతో తోటి ముస్లిం సోదరసమాజం పిలుస్తుంది. అయితే ఇస్లాం పట్ల అవగాహన లేని కొంతమంది 'ముస్లిం' సోదరులుగాని, విద్వాంసులుగాని ఈ నవముస్లింల పట్ల ప్రవర్తించే తీరు కొంతమేర అభ్యంతరకరంగానూ, ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) వారి సాంప్రదాయానికి వ్యతిరేకంగానూ ఉంది. ఇస్లాం పట్ల అవగాహన ఉన్నవారు వీరిని ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటున్నారు. దారి తప్పిన తమ సోదరుడు లేదా సోదరి తిరిగి తన గూటికి చేరుకున్నారన్న ఆనందోత్సాహం వారిలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఇస్లాం ధర్మాన్ని అవగాహన చేసుకుంటే, ఏ ధర్మానికి చెందినవారైనా సరే, ఇది ఖచ్చితంగా దైవధర్మమనే విషయాన్ని అంగీకరిస్తారు. కాని ఈ ధర్మాన్ని ఆచరించడానికి మనో ధైర్యం కావాలి. దైవ భీతికలవారికి ఇది సునాయాసంగా లభిస్తుంది. కుటుంబానికో, సమాజానికో భయపడటం వల్లనో లేదా ఇతరత్రా కారణాల వల్లనో దైవధర్మానికి చాలామంది దూరంగా ఉన్నారు.

అలాగే కొత్తగా దైవధర్మంలోకి వచ్చిన వారికి చాలా సందేహాలుంటాయి. ఒక్కసారిగా అన్ని పుస్తకాలనూ వారు చదువలేరు. ధర్మావగాహనకు కూడా కొంత సమయం పడుతుంది. అనుభవజ్ఞుల వివరణలు వీరికి చాలా అవసరం. ఇంతకు ముందరి జీవితంలోని కొన్ని అభ్యంతరకరమైన అలవాట్లు నుండి దూరం కావడానికి మరికొందరికి సమయం పడుతుంది. వారు ప్రారంభంలో ఓ ప్రత్యేకావస్థకు గురై ఉంటారు. వారికి ప్రవక్తగారి సాంప్రదాయ ప్రకారం సౌమ్యంగా, సహనంతో అన్ని విషయాలను ఆకళింపు చేసుకొనేలా చేయడం, వారికి తోడుగా ఉండడం మనందరి బాధ్యత.

ఈ శీర్షిక ద్వారా వీలుని బట్టి నవ ముస్లిం సోదరులకు ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని సునాయాసంగా అధిగమించడానికి ఖుర్ఆన్, హదీసుల వెలుగులో పరిష్కారాలను కూడా అందించే ప్రయత్నం జరుగుతుంది.

## ఆమినా అస్సిల్మి

**అరబ్బుల నందరినీ క్రైస్తవులుగా మార్చాలనుకున్న సదరన్ బాప్టిస్ట్ యువతి, ఓ కంప్యూటర్ మిస్టేక్ వలన సత్యధర్మంలోకి అడుగిడి, 32 సంవత్సరాలుగా అమెరికాలోని క్రైస్తవులను ఇస్లాం వైపుకు ఆహ్వానిస్తున్న ఈమె 1975లో అసమాన సామర్థ్యమున్న బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్. అవార్డులను గెలుచుకుంటూ, స్వంత వ్యాపారాన్ని చూసుకునే ఈమె జీవితం ఓ విచిత్రమైన మలుపు తిరిగింది.**

**"నేను ముస్లింనని చెప్పుకోవడానికి సంతోషపడుతున్నాను. ఇస్లాం నా జీవితం. ఇస్లాం నా గుండె చప్పుడు.<br>ఇస్లాం నా రక్తనాళాలలో ప్రవహించే రక్తం. ఇస్లాం నా బలం. ఇస్లాం నా అద్భుతమైన, అందమైన జీవితం.<br>ఇస్లాం లేకుండా నేను లేను. అల్లాహ్ తన చూపుని నా వైపునుండి త్రిప్పితే నేను బ్రతకలేను"**

అని చెప్పిన ఈ సోదరి ఇస్లాంకోసం ఎన్నో త్యాగాలను అల్లాహ్‌పై విశ్వాసంతో సునాయాసంగా చేసి, 16 సంవత్సరాలపాటు ఎన్నో కష్టాలను ఎదుర్కొని, చివరకు తను జీవితంలో కోల్పోయిన దానికంటే ఎన్నో రెట్లు ఎక్కువైన దానిని సాధించి, తోటి ముస్లింలకు ఓ ప్రియ సోదరైన ఆమినా అస్సిల్మి యొక్క జీవిత కధను ఈనెల అందిస్తున్నాం.

## నేను ముస్లింని కాగలనా! నేను అమెరికన్‌ని మరియు నాది తెల్ల జాతి!

ఆమినా మొదటిసారిగా ముస్లిములను కలిసినప్పుడు, రిక్రియేషన్‌లో ఆమె డిగ్రీ పూర్తికావస్తుంది. డిగ్రీ మొదటి సంవత్సరంలోనే తీసుకోబోయే కోర్సు గురించి ముందుగానే రిజిష్టర్ చేసుకోవచ్చు. ఆ విధంగా రిజిష్టర్ చేసుకుని తన పనులు చూసుకోవడానికని ఓక్లహామా వెళ్ళారు. ఆ వ్యవహారాలు పూర్తికావడానికి అనుకున్నదానికంటే ఎక్కువ సమయం పట్టడం వలన, స్కూలుకి ఆలస్యంగా రావడం జరిగింది. ఇక ఇప్పుడు ఏదైనా ఓ కోర్సుని డ్రాప్ చేసుకోవడానికి అవకాశం లేదు.

మిస్సయిన వర్క్‌ని అందుకోవడంలో ఆమెకి కంగారుపడ వలసిన అవసరం లేదు. క్లాసులో, తన సబ్జక్టులో టాప్ ర్యాంక్‌లో ఉంటూ, ప్రొఫెషనల్స్‌తో కూడా పోటీపడి చాలా అవార్డులు గెలుచుకున్నారు. ఇంత ప్రతిభ ఉన్నప్పటికీ, ఈమె తీవ్రమైన సిగ్గు, బిడియాలతో ఇతరులతో చాలా తక్కువగా మాట్లాడేవారు. ఎవరితోనైనా మాట్లాడటం చాలా అరుదు. బాగా అవసరమైతేనే మాట్లాడేవారు లేదా తెలిసిన వారితోనే మాట్లాడటానికే ఇష్టపడేవారు. ఆమె తీసుకునే క్లాసులు ఎడ్మినిస్ట్రేషన్, సిటీ ప్లానింగ్, పిల్లల ప్రోగ్రామింగ్ మొ॥వి. కాని ఆమె ఎక్కువగా హాయి పొందేది పిల్లలతోనే.

సరే, కథలోకి వెనక్కి వెళితే ......

కంప్యూటర్ ప్రింటవుట్ ఆమెకో షాక్ ఇచ్చింది. ఇంతకీ తాను రిజిష్టర్ చేసుకున్నది ఓ థియేటర్ క్లాస్ (అంటే పొరపాటున, థియేటర్ క్లాసుగా రిజిష్టర్ అయింది). థియేటర్ క్లాసంటే ప్రత్యక్షంగా, వాస్తవ మనుష్యుల ఎదురుగా ప్రదర్శించవలసి ఉంటుంది. క్లాసులో ఓ ప్రశ్నను సహితం అడగలేని ఆమె, ప్రజలెదురుగా స్టేజీ మీదికెళ్లడానికి భయపడింది.

ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే ఆమె భర్త, ఆమె సమస్యను క్లాస్ టీచర్‌కు వివరించమని సలహా ఇచ్చారు. ఈ విషయం నుండి ఆమెను బయటపడేలా చేయడానికి టీచర్ ప్రయత్నిస్తానని భరోసా ఇచ్చింది. కాబట్టి క్లాసుకు వెళ్లారు. అయితే ఆమెకి 2వ షాక్ ఏమిటంటే, క్లాసు పూర్తిగా అరబ్బులతో నిండి ఉండటమే. ఎప్పుడూ అరబ్బులను ప్రత్యక్షంగా చూడని ఆమెకు క్లాసులో ఓ సమూహమే కనిపించేసరికి, వారిపై తనకుండే ద్వేషం, దురభిప్రాయాల వలన, క్లాసులో కూర్చోకుండా ఇంటికి వెళ్ళిపోయింది. ఆమె చెప్పారు "ఈ సందర్భంలో మీరు ఓ విషయాన్ని తెలుసుకోవాలి. నేను లెదర్ హాట్ ప్యాంట్ వేసుకుని, పై భాగాన తాళ్ళతో కట్టుకునే టాప్‌ను ధరించి, చేతులలో 'మందు' గ్లాసుతో ఉన్న నాలాంటి మహిళకు, (నా మనస్సుకు నా కంటే ఆ) అరబ్బులే చెడ్డవారిగా అనిపించారు."

ఇక క్లాసుకు, వెనక్కి వెళ్ళే ప్రసక్తి లేదని ఆమె తన భర్తతో చెప్పినప్పుడు, ఆయన తన సహజ ప్రశాంత ధోరణిలోనే స్పందించారు. ప్రతీదానికి దైవం ఏదో ఓ కారణాన్ని ఉంచుతారనే విషయాన్ని భర్తకు ఎప్పుడూ ఈమె చెబుతూ ఉండేది. ఆ విషయాన్నే ఆమెకు గుర్తు చేసి, చివరి నిర్ణయం తీసుకునే ముందు, కొంత సమయం తీసుకుని, బాగా ఆలోచించుకోమని చెప్పారు. అంతేకాకుండా, ఆమెకున్న స్కాలర్ అవార్డ్ వలన ట్యూషన్ ఫీజు కట్టవలసిన అవసరం లేదు. అది నిలబెట్టు కోవాలంటే క్లాసుకెళ్ళడం తప్పదు మరి.

ఆ తర్వాత రెండు రోజులు ఏదైనా మార్గం చూపించమని దైవాన్ని ప్రార్థించింది. నరకాగ్ని నుండి ఈ బుద్ధిహీనుల్ని (అప్పటి ఆమె ఉద్దేశంలో అరబ్బులని) రక్షించడానికే దైవం ఆమెను ఈ క్లాసులో ఉంచడం జరిగిందని, తనకు తానే సర్ది చెప్పుకుని తిరిగి రెండు రోజులకు క్లాసుకు వెళ్ళింది.

క్లాసులో, జీసెస్‌ను వారి వ్యక్తిగత రక్షకుడిగా అంగీకరించక పోతే, వారు తమ పరలోక జీవితమంతా నరకాగ్నిలోనే కాలుతుంటారని ఆమె వివరించి చెప్పినా సరే, వారు మాత్రం చాలా మర్యాద చూపారే గాని, క్రైస్తవాన్ని స్వీకరించలేదు. తరువాత జీసెస్ వారిని ఎలా ప్రేమించాడో, వారి పాపాలనుండి కాపాడటానికి శిలువపై ఎలా మరణించాడో వివరిస్తూ, వారు మనస్ఫూర్తిగా అంగీకరించాలని చెప్పినా, తిరిగి వారు మర్యాద చూపారేకాని ఇంకనూ క్రైస్తవాన్ని స్వీకరించలేదు. కాబట్టి వారి స్వంత గ్రంథాన్ని చదివి, దాని ద్వారానే 'ఇస్లాం వాస్తవ ధర్మం' కాదని మరియు ముహమ్మద్ (స) 'వాస్తవ దైవం' కాదని వారికి నిరూపించాలనే నిర్ణయానికొచ్చింది. (క్రైస్తవులు, వారి ప్రవక్త 'ఈసా'(అ)ను దైవంగా పూజిస్తారు కాబట్టి ముస్లిములు కూడా ముహమ్మద్ (స) వారిని దైవంగా పూజిస్తారని అప్పట్లో ఆమె భావించేవారు).

విద్యార్థులలో ఒకతను ఆమెకు ఒక ఖుర్‌ఆన్ ప్రతిని, ఇస్లాం గురించి తెలియజేసే మరో పుస్తకాన్ని ఇచ్చాడు. ఆమె పరిశోధనను మొదలు పెట్టారు. తనకవసరమైన ఆధారం చాలా తొందరగా దొరుకుతుందనే నమ్మకంతోనే, ఆమె ఖుర్‌ఆన్‌ను, రెండవ పుస్తకంతో పాటుగా, 15 ఇతర పుస్తకాలను మరియు సహీ ముస్లిం హదీసులను చదివాక, మరలా ఖుర్‌ఆన్ గ్రంథాన్ని చదవడం ప్రారంభించారు. అయితే అరబ్బుల నందరినీ క్రైస్తవులుగా మార్చాలనే పట్టుదల మాత్రం ఆమెలో అలాగే ఉంది. ఆమె చదువు మరో సంవత్సరమున్నర కొనసాగింది.

ఈ సమయంలో, ఆమెకు భర్తతో సమస్యలు మొదలయ్యాయి. ఇస్లాం అధ్యయనం వలన ఆమెకు తెలియకుండానే ఆమెలో వస్తున్న చిన్న మార్పే ఆయనని బాధించగలిగింది. వీరిద్దరూ ప్రతీ శుక్రవారం మరియు శనివారం బార్‌కి లేదా పార్టీలకి వెళ్ళేవారు. ఇంతకు ముందరిలాగ బార్‌కి వెళ్ళే కోరిక అప్పుడు ఆమెలో లేదు. ఆమె చాలా నిరాడంబరంగా మారింది. ఆమెకు తెలియకుండానే, ఆయన మనస్సుకు దూరం అవుతూవుంది. తన భార్యలో వస్తున్న మార్పుని అతను మరోలా అర్థం చేసుకుని, ఆమె ఎవరితోనో సంబంధం పెట్టుకుందేమోనన్న ధృడమైన అనుమానంతో, ఆమెను బయటికి వెళ్ళగొట్టాడు. పిల్లలతో పాటు ఓ అపార్ట్‌మెంట్‌లోకి మారింది. కాని ముస్లింలను క్రైస్తవులుగా మార్చాలనే కృషి, పట్టుదల ఆమెలో అలాగే ఉన్నాయి.

ఆమె చెప్పిన వర్ణన ప్రకారం, ఒక రోజు తెల్లటి పొడవైన నైట్‌గౌన్ లాంటిది ధరించి, తలపై ఎరుపు, తెలుపు గడులున్న టేబుల్ క్లాత్ లాంటిది ధరించిన ఓ వ్యక్తి ఆమె తలుపు తట్టాడు. ఆయనతో పాటు మరో ముగ్గురు పైజమాలు ధరించిన వారున్నారు (వారి సాంప్రదాయ దుస్తుల్ని చూడటం ఆమెకి అదే మొదటిసారి). రాత్రి వేసుకునే దుస్తులు లాంటి బట్టలతో కనిపిస్తున్న మగవాళ్లని చూశాక, తనకి చాలా కోపం వచ్చింది. 'నన్ను ఎలాంటి ఆడదాన్ననుకుంటున్నారు వీళ్లు? వారికి పౌరుషం, హుందాతనం లేవా? అని లోపల అనుకుంటుండగా, ఆమె షాక్‌ను అర్థం చేసుకున్న, టేబుల్ క్లాత్‌ను

ధరించిన వ్యక్తే ముందుగా మాట్లాడాడు. ఆమె ముస్లిం కావాలని కోరుకుంటుందనే విషయం తనకు తెలిసిందని చెప్పాడు. తను ముస్లిం కావాలని కోరుకోవడం లేదని, తనొక క్రిస్టియన్‌నని చెప్పారామె. అయినప్పటికిని, వారికి సమయముంటే, ఇస్లాంపై తను కొన్ని ప్రశ్నలు అడగాలని అనుకుంటున్నట్లు కూడా తెలియ జేశారామె.

ఆతని పేరు అబ్దుల్ అల్-షేఖ్. ఆమెతో చర్చించడానికి వీలు చేసుకున్నాడు. అతనిలోని సహనాన్ని ఆమె గుర్తించింది. ప్రతీ ప్రశ్నను ఆమెతో చర్చించాడు. ఆమె ఎప్పుడూ మూర్ఖంగా ఫీలయ్యేలా గాని, ఆమె అడిగిన ప్రశ్న బుద్ధిహీనమైనదని గాని ఎప్పుడూ చెప్పలేదు. 'ఆరాధ్యుడు ఒక్కడే' అని నమ్ముతున్నావా?' అని అడిగాడు. ఆమె 'ఔను' అని సమాధానమిచ్చారు. తరువాత 'ముహమ్మద్(స) దైవ సందేశహరుడు అని నమ్ముతున్నావా?' అని అడిగాడు. మరలా తను 'ఔను' అని సమాధానమిచ్చారు. ఆమె అప్పటికే ముస్లిం అయిపోయినట్లు ఆయన తేల్చి చెప్పేసారు.

తను ఇస్లాం అర్థం చేసుకోవడానికి మాత్రమే ప్రయత్నిస్తున్నానని, తను క్రిస్టియన్ నని వాదించారు. (అయితే ఆమెలో ఆలోచన మొదలైంది - 'నేను ముస్లింని కాగలనా? నేను ఓ అమెరికన్‌ని మరియు నాది తెల్లజాతి! నా భర్త ఏమంటాడు? నేను ముస్లింనైతే, నా భర్తకు విడాకులివ్వవలసి వస్తుందే, అయ్యో! నా కుటుంబం నాశనమౌతుంది')

వారు మాట్లాడుకుంటూనే ఉన్నారు. తరువాత 'జ్ఞానాన్ని సంపాదించడం మరియు ఆధ్యాత్మికతను అర్థం చేసుకోవడ మనేది నిచ్చెన ఎక్కుతున్నంత స్వల్పమైనదని, నిచ్చెన ఎక్కేటప్పుడు, నిచ్చెన అడ్డుకర్రలు కొన్నింటిని దాటాలని ప్రయత్నించినప్పుడు, పడిపోయే ప్రమాదముంది.

'షహదా' (అంటే దేవుడు ఒక్కడే అని, ముహమ్మద్(స) అల్లాహ్ యొక్క సందేశహరుడు అని ప్రకటించడం) కేవలం నిచ్చెన పైన వేసే మొదటి అడుగు మాత్రమేనని' ఆయన వివరించారు.

తరువాత ఆ మధ్యాహ్నమే (తేది మే 21, 1977) అసర్ నమాజ్ సమయంలో, ఆమె 'షహదా' పలికారు. అయినప్పటికిని ఆ సమయానికి కొన్ని విషయాలను ఆమె ఇంకనూ అంగీకరించే స్థితిలో లేరు. మనస్సులో ఒకటి పెట్టుకుని, బయటికి మరోటి చెప్పే తత్వం ఆమెది కాకపోవడం వలన, ఆమె బహిరంగంగానే ఆ 'షహదా'తో పాటుగా (హక్కుల) పరిత్యాగాన్ని కూడా కలపడం జరిగింది. "నేను, ఆరాధ్యుడు ఒక్కడే అని, ముహమ్మద్ (స) దైవం యొక్క సందేశహరుడని సాక్ష్యమిస్తున్నాను. కాని, నేను నా జుట్టును ఎప్పుడూ కప్పుకోను (అంటే హిజాబ్ లేదా బురఖా ధరించడం ఆమెకి అప్పటికి ఇష్టం లేదు). అలాగే నా భర్త మరో భార్యను పెళ్లి చేసుకుంటే, నేను అతనిని సంసారానికి పనికిరాకుండా చేసేస్తాను".

ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మిగిలిన సోదరులతో, ఆమెకిష్టం లేని ఆ రెండు విషయాల ప్రసక్తిని ఆమె ముందెన్నడూ తేవద్దని చెప్పారన్న విషయం ఆమెకి తరువాత తెలిసింది. ఆమె సరిగ్గానే అర్థం చేసుకుంటున్నట్లు అతను చెప్పేవాడు.

ఆధ్యాత్మిక జ్ఞానానికి మరియు దైవసాన్నిహిత్యానికి 'షహదా' పలకడం వాస్తవానికి నిచ్చెనపై ధృడంగా కాలు మోపడం లాంటిది. కాని అది చాలా నెమ్మదిగా జరిగే ఆరోహణ మాత్రమేనని వివరించాడు. అబ్దుల్ అజీజ్ రావడం మరియు ఆమె ప్రశ్నలకు సమాధానాలివ్వడం కొనసాగుతూనే ఉంది.

"అబ్దుల్ అజీజ్ యొక్క సహనానికి, ఓర్పుకి అల్లాహ్ మంచి ప్రతిఫలాన్నిచ్చుగాక! అతను నన్నెప్పుడూ ఆదేశించలేదు. నా ప్రశ్న బుద్ధిహీనంగా లేదా మూర్ఖంగా ఉందని ఎప్పుడూ చెప్పలేదు. అతను నా యొక్క ప్రతీ ప్రశ్నను హుందాగా చర్చించాడు. ఎప్పుడూ అడుగక పోవడమే మూర్ఖమైన ప్రశ్న అని వివరించాడు. మ్‌మ్...... నా బామ్మ కూడా అదే చెబ్తూండేది. అల్లాహ్ జ్ఞానాన్ని అన్వేషించ మన్నారని, ప్రశ్నలనేవి అన్వేషణలోని ఓ సాధన మార్గమేనని వివరించాడాయన. అతను ఏదైనా వివరించినప్పుడు, అది ఎలా ఉండేదంటే గులాబీ పువ్వు యొక్క రేకులు ఒకదాని తర్వాత మరొకటిగా తన పూర్తి ఘనతను చేరేవరకూ విచ్చుకోవడం చూస్తున్నట్లుగా ఉండేది. ఏదైనా విషయాన్ని నేను అంగీకరించడం లేదని చెప్పినప్పుడు, నేను ఓ పాయింట్ వరకూ కరెక్టేనని ఎప్పుడూ చెప్తుండేవారు. పూర్తిగా అర్థం కావడానికి వేర్వేరు దిశల నుండి ఆ విషయాన్ని ఎంత లోతుగా అధ్యయనం చేయాలో తెలిపేవారు". అల్‌హమ్దులిల్లాహ్ (పొగడ్తలన్నీ అల్లాహ్ కొరకే!)

సంవత్సరాలు గడుస్తున్నాయి. చాలామంది టీచర్స్‌ని చూశారామె. ప్రతీ ఒక్కరులోనూ ఓ ప్రత్యేకత, ఓ విభిన్నత కనిపించింది. జ్ఞానాన్ని పొందడంలో వీరు చేసిన సహాయానికి వారిపై ఆమెకెంతో కృతజ్ఞతా భావం ఉంది. ఆమె ఎదిగేలా, ఇస్లాంను మరింత ప్రేమించేలా చేశారు. ఇస్లాం యొక్క జ్ఞానం ఆమెలో పెరిగేకొద్దీ, ఆమెలోని మార్పులు చాలా ప్రస్ఫుటం కాసాగాయి. మొదటి సంవత్సరంలోనే హిజాబ్‌ను ధరించింది. ఆమె ఎప్పుడు హిజాబ్ ధరించిందో ఆమెకే తెలియదని చెప్పారామె. ఆమెలో పెరుగుతున్న ఇస్లామీయ జ్ఞానం మరియు అవగాహనం సహజంగానే ఆమెను హిజాబ్ ధరించేలా చేసాయి. ఇంతకు ముందు 'షహదా' సమయంలో వ్యతిరేకించిన 'బహుభార్యాత్వాన్ని' సయితం ఆమె ఇప్పుడు సమర్ధించడం ప్రారంభించింది. అల్లాహ్ బహు భార్యాత్వానికి అవకాశమిచ్చారు అంటే, అందులో ఏదో మంచి ఉంటుందని ఆమె గ్రహించగలిగింది.

> **"(ఓ ప్రవక్తా!) మహోన్నతుడైన నీ ప్రభువు నామాన్ని కొనియాడు, ఆయన (విశ్వాన్ని) సృష్టించాడు, సమమైన తూకాన్ని నెలకొల్పాడు, జాతకం నిర్ణయించాడు, ఆపై, మార్గం చూపించాడు, వృక్ష జాతులను పుట్టించాడు, తిరిగి వాటిని నల్లని చెత్తాచెదారంగా మార్చాడు. మేము నిన్ను చదివిస్తాము, ఆ తరువాత నీవు మరచిపోవు అల్లాహ్ కోరినదాన్ని తప్ప, ఆయనకు బహిరంగ మయినవీ తెలుసు, గోప్యమయినవీ తెలుసు. మేము నీకు సులభమైన మార్గంలో ఉండే సౌకర్యాన్ని కలుగుజేస్తున్నాము, కనుక నీవు హితబోధ చేస్తూ ఉండు, హితబోధ గనక లాభదాయకమయితే." (దివ్య ఖుర్'ఆన్ 87:1-8)**

"నేను ప్రారంభంలో ఇస్లాంని అధ్యయనం చేయడం ప్రారంభించినపుడు, వ్యక్తిగత జీవితంలో నాకు అవసరమైన వాటిని కనుగొంటానని అప్పటికి అనుకోలేదు. ఇస్లాం నా జీవితాన్ని మారుస్తుందన్న విషయం కూడా నేను అనుకోలేదు. నేను చివరికి ఇస్లాం వలన ప్రశాంతతను పొందుతానని, ప్రేమా సంతోషాల వెల్లువతో జీవిస్తాననే విషయాన్ని, ఎవరూ కూడా అప్పట్లో నన్ను నమ్మించి ఉండగలిగే వారు కాదేమో!

ఈ గ్రంథం ఒకే ఒక్క ఆరాధ్యుడు గురించి, విశ్వ సృష్టికర్త గురించి చెబుతుంది. ఆయన సుందర మార్గంలో ఈ విశ్వాన్ని ఎలా ఏర్పరిచారో వర్ణిస్తుంది. ఈ అద్భుత ఖుర్‌ఆన్ (అన్ని ప్రశ్నలకూ) సమాధానాలను కలిగి ఉంది. అల్లాహ్ ప్రేమించేవాడు. అల్లాహ్‌యే శాంతికి మూలం! అల్లాహ్‌యే రక్షకుడు! అల్లాహ్‌యే క్షమించువాడు! అల్లాహ్‌యే సమకూర్చేవాడు! అల్లాహ్‌యే ఆదుకునేవాడు! అల్లాహ్‌యే దయ గలవాడు! అల్లాహ్‌యే స్పందించేవాడు (సమాధాన మిచ్చేవాడు)! అల్లాహ్‌యే రక్షించే స్నేహితుడు! అల్లాహ్‌యే విస్తరింపజేసేవాడు!''

> **"(ఓ ప్రవక్తా!) మేము నీ హృదయాన్ని నీ కొరకు తెరవలేదా? నీ నడుమును విరిచేస్తూవుండిన ఒక పెద్ద భారాన్ని నీపై నుండి దించివేశాము, నీ కొరకు నీ పేరు ప్రఖ్యాతుల్ని ఇనుమడింప జేశాము. కనుక కష్టాలతో పాటు తప్పనిసరిగా సుఖాలు కూడా ఉన్నాయి. ఇందులో ఎలాంటి సందేహం లేదు. కష్టాలతో పాటు తప్పనిసరిగా సుఖాలు కూడా ఉన్నాయి."**
> **(దివ్య ఖుర్‌ఆన్ 94:1-6)**

**ఉనికికి సంబంధించిన అన్ని విషయాలను ఖుర్‌ఆన్ వివరిస్తుంది. విజయం సాధించడానికి స్పష్టమైన మార్గాన్ని చూపుతుంది. మానవజీవనం కోసం ఓ మాన్యువల్ (నిర్దేశక గ్రంథమే) ఖుర్‌ఆన్.**

ఇస్లాం తన జీవితాన్ని ఎలా మార్చిందో ఆమె మాటలలోనే తెలుసుకుందాం.

''మనం చీకట్లో గనుక ఒకసారి జీవించినట్లయితే, మనం కాంతిని ఎంత ఎక్కువగా ప్రేమిస్తామో ......

నేను మొదట ఇస్లాంని స్వీకరించినప్పుడు, వాస్తవంగా ఇది నా జీవితంపై చాలా ఎక్కువ ప్రభావాన్ని చూపుతుందని నేను అనుకోలేదు. ఇస్లాం నా జీవితంపై తగిన ప్రభావాన్ని చూపడమే కాదు, నన్ను పూర్తిగా మార్చివేసింది. నా భర్త నేను పరస్పరం గాఢంగా ప్రేమించుకున్నాం. ఆ ప్రేమ ఇప్పటికీ ఉంది. అయినప్పటికిని, నేను ఇస్లాం అధ్యయనాన్ని ప్రారంభించినపుడు మా మధ్య ఇబ్బందులు మొదలయ్యాయి. నాలోని మార్పులను నా భర్త చూస్తున్నాడు గాని, నాలో ఏం జరుగుతుందో ఆయన అర్థం చేసుకోలేదు. నేను సయితం నన్ను అర్థం చేసుకోలేకపోయాను. నేను మారుతున్నాననే విషయాన్ని సయితం నేను తెలుసుకోలేకపోయాను. నాలో ఇలాంటి మార్పును తేగలిగేది మరో పురుషుడే అయ్యుంటాడని నా భర్త ఓ నిర్ణయానికి వచ్చాడు. నాకే అర్థం కాని నాలోని మార్పుకు ఏమి కారణమై ఉంటుందో అర్థం చేసుకోవడానికి ఆయనకి మరో మార్గం లేకుండా పోయింది.''

ఓ స్త్రీ దైవ ధర్మం వలన మార్పు చెందుతుంటే, ఆ ధర్మాన్ని మరో మగవాడుగా భావించడం జరిగింది. ఆ మరో మగవాడిని కనుగొనడానికి ఆమె భర్తకు సాధ్యం కాలేదు. కాని భర్త అనుమానం ప్రకారం ఆ మరో వ్యక్తి ఉండి ఉండాలి. అంతే. ఓ నిరాశావహమైన విడాకుల ద్వారా వారి వివాహబంధం ముగిసింది. సాంప్రదాయంకాని మతం, ఆమె పిల్లల అభివృద్ధికి హానికరమని న్యాయస్థానం నిర్ణయించింది. కాబట్టి పిల్లలను ఆమె సంరక్షణ నుండి తొలగించారు.

విడాకుల సమయంలో ఆమెకు ఓ అవకాశాన్నిచ్చారు. అది ఏమిటంటే, ఆమె ఇస్లాంని వదిలేస్తే, పిల్లలు ఆమె సంరక్షణలో ఉంటారు. ఆమెకు ఇస్లాం కావాలంటే పిల్లలను వదిలెయ్యాలి. ఎంతో అమానుషమైన ఛాయిస్. ఏ మాతృమూర్తికైనా ఇది సాధ్యం కాని ఎంపిక.

''నేను అల్లాహ్ లేడని చాటలేను. అప్పుడే కాదు, ఎప్పుడూ కూడా. ఇంతకు ముందెన్నడూ ప్రార్థించని విధంగా నేను ప్రార్థించాను. 30 నిమిషాల అనంతరం, అల్లాహ్ చేతులలో తప్ప నా పిల్లలకు సురక్షిత ప్రదేశం మరోటి లేదని గ్రహించాను. ఒకవేళ నేను అల్లాహ్ లేడని చాటితే, అల్లాహ్ యొక్క అద్భుతాలను భవిష్యత్తులో నా పిల్లలకు చూపే మార్గం లేకుండా పోతుంది. నేను కోర్టుకు చెప్పాను - నా పిల్లలను అల్లాహ్ చేతులలో వదులుతున్నానని. ఇది ఎంత మాత్రం నా పిల్లలను తిరస్కరించడం కాదు.''

పిల్లలు లేకుండా జీవితం గడపడం ఎంత కష్టమో గ్రహిస్తూనే, ఆమె కోర్టును వదిలారు. ''నేను చేసిన పని సరైనదని నాకు తెలిసినప్పటికీ, నా హృదయం తీవ్రంగా గాయపడింది''. నేను ఆయతుల్ కుర్సీలో ఓదార్పును పొందాను.

> **అల్లాహ్ - ఆయన తప్ప ఆరాధ్యదైవం ఎవ్వడూ లేడు. సకల చరాచర సృష్టికి మూలాధారం అయిన ఆయన సజీవుడు, నిత్యుడు, అనంతుడు. ఆయన నిదురపోడు, ఆయనకు కునుకూ రాదు. భూమ్యాకాశాలలో ఉన్న సమస్తమూ ఆయనదే. ఆయన సమ్ముఖంలో ఆయన అనుమతి లేకుండా సిఫారసు చెయ్యగలవాడెవ్వడు? ప్రజల ముందు ఉన్నదానినీ ఆయన ఎరుగును. వారికి గుప్తంగా ఉన్నదీ ఆయనకు తెలుసు. ఆయన స్వయంగా తెలియజెయ్యాలని అభిలషిస్తే తప్ప ఆయన జ్ఞానములోని ఏ విషయమూ వారి గ్రహణ పరిధిలోకి రాదు. ఆయన పీఠం ఆకాశాలనూ, భూమినీ పరివేష్టించి ఉంది. వాటి సంరక్షణ ఆయనకు ఎంతమాత్రం అలసట కలిగించదు. ఆయన మాత్రమే సర్వాధికుడు, సర్వోత్తముడూను.**
> **(దివ్య ఖుర్‌ఆన్ 2:255)**

ఇదే ఆమెకు అల్లాహ్ యొక్క (99) విశేషణ పదాలను గ్రహించేలా మరియు ప్రతీ పదంలో ఉన్న సౌందర్యాన్ని కనుగొనేలా చేసింది.

పిల్లల సంరక్షణ బాధ్యతను ఆమె భర్తకు అప్పగించారు. ఆమినా అస్సిల్మి ఈ కేసును వదిలేయలేదు. తిరిగి పోరాడారు. ఈ కేసును మీడియా దృష్టికి తీసుకెళ్లారు. పిల్లల సంరక్షణను ఆమె మరలా పొందలేక పోయినప్పటికినీ, అమెరికాలోని 'కాలరెడో' చట్టంలో మార్పు చేశారు. దాని ప్రకారం ఎవరి పిల్లల సంరక్షణను అయినా సరే, వారి మతాన్ని బట్టి ఖండించే వీలు ఎవరికీ లేదు.

ఆమె ఎదుర్కొన్న కష్టాలు - పిల్లల సంరక్షణ మరియు విడాకుల విషయాలకి సంబంధించి మాత్రమే కాదు. కుటుంబంలోని మిగిలినవారు కూడా ఆమె ఎంపికను సమ్మతించలేదు. ఆమెనందరూ తిరస్కరించారు.

''మా అమ్మ నమ్మకమేమంటే, ఇది ఓ దశమాత్రమేనని, నేను దాని నుండి బయటపడతానని. మానసిక వైద్య నిపుణురాలైన నా సోదరి - నా మానసిక

ఆరోగ్యం దెబ్బతిందని, హాస్పత్రిలో చేర్పించాల్సిందేననే అభిప్రాయానికొచ్చింది. నా తండ్రి అయితే నన్ను నరకంలో లోతుగా పడవేయకముందే నన్ను చంపాలనుకున్నాడు.''

స్నేహితులు మొదటి సంవత్సరంలోనే ఆమె నుండి దూరమయ్యారు. బార్లకు, పార్టీలకు వెళ్లే కోరిక లేదు. ఓ బాయ్‌ఫ్రెండ్‌ని వెతుక్కునే ఇంటరెస్ట్ లేదు. ఆమె ఎప్పుడూ చేసే పని - ఖుర్'ఆన్‌ని చదవడం, ఇస్లాం గురించి మాట్లాడటమే.

ఇస్లాం ఎంత అందమైనదో వారికి అర్థమయ్యేలా చెప్పేటంత జ్ఞానం ఇంకనూ పొందవలసి ఉందని ఆ రోజుల్లో ఆమె అభిప్రాయపడేది. బ్రాడ్‌కాస్టింగ్ ఫీల్డులో ట్రెండ్ సెట్టర్‌గా, మనీ మేకర్‌గా గుర్తించబడి, దాదాపు ప్రతీ అవార్డును గెలుచుకున్న ఆమెను, హిజాబ్ ధరించిన రోజే ఉద్యోగం నుండి తీసివేసారు. కుటుంబాన్ని, స్నేహితుల్ని, ఉద్యోగాన్ని పోగొట్టుకుని ఒంటరి మహిళగా మిగిలినా, ఆమె మనోధైర్యం కించిత్తు కూడా చెక్కు చెదరలేదు.

హిజాబ్ ధరించిన ఈమె బ్యాంక్‌లో ఓసారి చెక్ మార్చాలని ప్రయత్నిస్తుండగా, సెక్యూరిటీ గార్డు గన్‌తీసి, ఈమె ఏదైనా అనుమానా స్పదంగా కదిలితే కాల్చడానికి రెడీ అయ్యాడట.

ఇస్లాంని అంగీకరించడం ద్వారా, ఆమె మారిన వ్యక్తిగా, ఓ ఉత్తమ వ్యక్తిగా గుర్తింపబడింది. ఆమె మేనరిజాన్ని, ఆమెలో అంతగా మార్పుకు కారణమైన ఆమె విశ్వాసాన్ని గమనించిన ఆమె బంధువులు, కుటుంబ సభ్యులు, ఆమె చుట్టూ ఉన్నవారు ఆమెను ప్రశంసించడం ప్రారంభించారు. మొదట్లో ఆమె కుటుంబం తిరస్కరించినప్పటికినీ, ఆమె మాత్రం వారితో సంబంధంలోనే ఉంటూ, గౌరవంతో, అణుకువతో వారితో మాట్లాడుతుండేది. (ఖుర్'ఆన్ ముస్లిములను ఆదేశించిన విధంగా) వివిధ ప్రత్యేక సందర్భాలలో తన తల్లిదండ్రులకు కార్డులు పంపుతూ ఉండేది. ఆ కార్డు దిగువన, ఖుర్'ఆన్ నుండి గాని హదీసుల నుండి గాని జ్ఞానానికి సంబంధించిన సుందరమైన పదాలతో కూడిన వాక్యాలను వ్రాస్తూ ఉండేది. అయితే ఆ వాక్యాలను తాను ఎక్కడి నుండి గ్రహించింది వ్రాసేది కాదు. ఇది ఆమె కుటుంబ సభ్యులపై మంచి ప్రభావాన్ని చూపింది.

ఆమె కుటుంబ సభ్యులలో మొదట ఇస్లాం స్వీకరించినవారు - ఆమె బామ్మ. ఆమె వయస్సు 100 సం॥లు దాటింది. ఆమె బామ్మ ఇస్లాం స్వీకరించిన కొన్నాళ్లకే మరణించింది.

''ఆమె 'షహదా' ప్రకటించిన రోజే, ఆమె పాపాలన్నీ తుడిచి వేయబడ్డాయి, ఆమె మంచి పనులు భద్రంగా ఉన్నాయి. ఇస్లాం స్వీకరించిన తర్వాత చాలా తొందరగానే ఆమె చనిపోవడం ద్వారా, ఆమె పుస్తకం మంచివైపు ఒరుగుతుందని గ్రహించాను. ఆ విషయమే నాలో ఆనందాన్ని నింపింది''.

ఆ తరువాత ముస్లింగా మారినది ఆమె తండ్రి. ఆమినా అస్సిల్మి ముస్లింగా మారిందని తెలియగానే ఆమెను చంపుతానన్న తండ్రే ఈయన. ఈ సంఘటన మీకు ప్రవక్తగారి ముఖ్య అనుచరులైన ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) వృత్తాంతాన్ని జ్ఞాపకం తెప్పిస్తుందని అనుకుంటున్నాను. ఈయన ఇస్లాం స్వీకరించకముందు, తన సోదరి ఇస్లాం స్వీకరించిందని తెలియగానే, బహిరంగంగా కత్తి తీసుకుని వెళ్ళడం జరిగింది. కాని ఖుర్'ఆన్‌లోని కొన్ని వాక్యాలను తన సోదరి ఇంటిలో చదివాక, ఆయన ఇస్లాం ధర్మం సత్యమని తెలుసుకున్నారు. ఆయన తిన్నగా ముహమ్మద్ (స) వారి దగ్గరికెళ్లి ఇస్లాంను స్వీకరించారు.

సోదరి అస్సిల్మి ఇస్లాం తీసుకున్న 2 సంవత్సరాలకి, ఆమె తల్లి పిలిచి, ఆమె విశ్వాసాన్ని అభినందించింది. అంతే కాకుండా ఆ విశ్వాసంతోనే ఉండాలని ఆశించింది. మరో రెండు సంవత్సరాల తర్వాత, ఆమె మరలా పిలిచి, ముస్లింగా మారాలంటే ఏది అవసరమని అడిగారు. 'ఆరాధ్యుడు ఒక్కడే అని, ముహమ్మద్ (స) ఆయన సందేశహరుడు' అని నమ్మవలసి ఉంటుందని అస్సిల్మి సమాధానం చెప్పారు. ఆ సమాధానం విన్న ఆమె తల్లి : 'ఏ తెలివి తక్కువ వారికైనా అది తెలుసు. కాని నీవు చేయవలసిందేమిటి' అని మరలా అడిగారు. అప్పుడు అస్సిల్మి సమాధానమిచ్చారు - 'నీవు నేను చెప్పిన ఆ విషయాన్ని అంగీకరించినట్లయితే నీవు అప్పటికే ముస్లిం అయిపోయినట్లే!'

'సరే ... బాగానే ఉంది. కాని మనం ఈ విషయాన్ని మీ నాన్నగార్కి అప్పుడే చెప్పవద్దు' అని అన్నారు.

కాని అప్పటికే అస్సిల్మి నాన్నగారు, ఇటువంటి సంభాషణతోనే కూతురు దగ్గర ఇస్లాంని స్వీకరించారు. ఈ విధంగా తల్లిదండ్రులిద్దరూ సంవత్సరాలుగా ముస్లిములుగా కలిసి జీవిస్తున్నప్పటికీ, ఒకరు ముస్లిం అని మరొకరికి తెలియదు. అస్సిల్మి గారిని హాస్పత్రిలో చేర్పించాలన్న ఆమె సోదరి - **'నాకు తెలిసిన వాళ్లలో నీవు మాత్రమే స్వేచ్ఛ పొందిన మహిళవు'** అంటూ ప్రశంసించింది. తన సోదరి నుండి అందుకున్న ఈ ప్రశంసే ఆమె అంతవరకూ అందుకున్న ప్రశంసల్లో చాలా గొప్పది.

అస్సిల్మి కుమారుడు పెరిగి పెద్దవాడయ్యాడు. 21 సంవత్సరాలు నిండాయి. అమ్మకు ఫోన్ చేసి తనుకూడా 'ముస్లిం' కావాలను కుంటున్నానని చెప్పాడు.

విడాకులు తీసుకున్న 16 సంవత్సరాల అనంతరం, ఆమె మాజీ భర్త ఇస్లాంను స్వీకరించారు. తన కూతురు కూడా అమ్మ ఆచరిస్తున్న ధర్మాన్నే కోరుకుంటుందని, అలాగే తన మాజీ భార్యను గత 16 సంవత్సరాలుగా గమనిస్తూనే ఉన్నానని అతను చెప్పిన విషయాన్ని అస్సిల్మికి బ్రదర్ ఖైజర్ ఇమామ్ తెలియజేశాడు. అది విన్న అస్సిల్మికి చాలా సంతోషం కలిగింది. మాజీ భర్త ఆమె దగ్గరకొచ్చి ఆమె విషయంలో తాను చేసినదానికి క్షమించమని కోరాడు. అతను నైస్ జంటిల్‌మేన్. అస్సిల్మి అతనిని ఏనాడో క్షమించింది.

అల్లాహ్ (సుబహానహూ వ త'ఆలా) కోసం అస్సిల్మి చేసిన త్యాగం ఎనలేనిది. అందుకు ప్రతిఫలంగా, అల్లాహుతాలా ఆమెపై అపారమైన కరుణను కురిపించాడు. ఒకప్పుడు ఇస్లాం వలన ఆమె స్నేహితులను కోల్పోగా, ఇప్పుడామెను ప్రేమించేవారు ఎంతో మంది ఉన్నారు. అల్లాహ్ యొక్క బ్లెస్సింగ్స్ ఎలా ఉన్నాయంటే, ఆమె ఎక్కడికి వెళ్ళినా, ఇస్లాం యొక్క సౌందర్యం ప్రజలను తాకేలా చేసి, వారు నిజధర్మాన్ని అంగీకరించేలా చేశాయి. ముస్లిములే కాకుండా ముస్లిమేతరులు కూడా సలహా సంప్రదింపుల కోసం ఆమె దగ్గరికి వస్తూనే ఉన్నారు.

'హిజాబ్'ను ధరించడం వలన ఆమె ఉద్యోగం పోగా , ఇప్పుడామె ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ ముస్లిమ్ వుమెన్'కి అధ్యక్షురాలు. అమెరికాలో దేశవ్యాప్తంగా ఎన్నో ఉపన్యాసాలిచ్చారు. అలాగే ఈమె ప్రసంగం

కోసం డిమాండ్ కూడా చాలా ఎక్కువే. అమెరికా సంయుక్త రాష్ట్రాల తపాలా సంస్థ వారు 'ఈద్' స్టాంప్‌ను ముద్రించేలా ఈమె తన ఆర్గనైజేషన్ ద్వారా విజయవంతంగా చర్చల ద్వారా ఆమోదింప జేశారు. ఇది సాధించడానికి ఆమెకు చాలా సంవత్సరాలు పట్టింది. ఈద్ (పండుగ) రోజును అమెరికా యొక్క జాతీయ శలవుదినంగా చేయాలని, ప్రస్తుతం ఆమె ప్రయత్నిస్తున్నారు.

అల్లాహ్ యొక్క ప్రేమపై, ఆయన కరుణపై ఆమెకు ఎనలేని విశ్వాసం. అల్లాహ్‌పై ఉన్న ఆమె విశ్వాసం ఏనాడూ కొంచెం కూడా సడలలేదు. కొన్ని సంవత్సరాల క్రితం ఆమెకి కాన్సర్ అని డయాగ్నసిస్ ద్వారా తెలిసింది. క్యాన్సర్ బాగా ముదిరిందని, ఆమె ఒక సంవత్సరం కంటే బ్రతకరని డాక్టర్లు చెప్పారు. కాని అల్లాహ్‌పై ఉన్న ఆమె విశ్వాసం అలాగే బలంగానే ఉంది.

**"మనమందరం చనిపోవాల్సిందే. నేను అనుభవించే బాధలోనే దీవెనలు ఉన్నాయని నా నమ్మకం".**

అల్లాహ్‌ను ఎంతగా ప్రేమించగలరో చెప్పటానికో విశిష్ఠమైన ఓ ఉదాహరణ : కరీమ్ అల్-మిసావి అనే ఆమె స్నేహితుడు చిన్న వయస్సులోనే (అంటే 20-30 సం॥ల మధ్య) కేన్సర్ వలన చనిపోయాడు.

''అతడు చనిపోవడానికి కొన్ని రోజుల ముందు, అల్లాహ్ నిజంగా కరుణగలవాడని అతను నాకు చెప్పాడు. అతను నమ్మశక్యంగాని తీవ్ర బాధలో ఉన్నాడు. అల్లాహ్ యొక్క ప్రేమని అన్నివైపులా ప్రసరింప జేస్తున్నాడు. అతను చెప్పాడు: 'నేను మచ్చలేని పుస్తకంతో (అంటే దోషరహితంగా) స్వర్గానికి చేరుకోవాలని అల్లాహ్ ఉద్దేశ్యమై ఉంటుంది.' అతని మరణం యొక్క అనుభవం నన్ను ఆలోచింపజేసింది. అతనే అల్లాహ్ యొక్క ప్రేమ కరుణల గురించి నాకు నేర్పాడు''.

స్తోత్రాలన్నీ అల్లాహ్ కొరకే, ఆమె కేన్సర్ రావడాన్ని తనకు గొప్ప బ్లెస్సింగ్‌గానే భావిస్తున్నారు. బోన్ కేన్సర్‌తో, ఆమె రెండుసార్లు మక్కాకు 'హజ్' చేశారు. కాన్సర్ వలన ఆమె ఎముకలు బలహీనమవడంతో చక్రాల కుర్చీ ఉపయోగిస్తు న్నారు.

''నేనింకా బ్రతికుండాలని దైవం నిర్ణయించినట్లున్నారు'' అని చెబుతారామె. "నేను ఏ విషయం కోసమైనా భయపడటం మానివేశాను. ప్రతీచోట నిజ ధర్మాన్ని చెప్పాలి. అది చాలా ముఖ్యం. నేను చేసే ప్రతీదానికి అల్లాహ్‌కు సమాధానం చెప్పుకోవలసి ఉంది. ఇస్లాంను పంచుకోవడం నాకిష్టం.

ఇస్లాం యొక్క నిజధర్మాన్ని అందరితో పంచుకోవాలనేది నాకు అతి ముఖ్యమైనదని తెలుసుకోగలిగాను. ముస్లిములైనా, ముస్లిమేతరులైనా నన్ను అంగీకరించినా లేదా నన్ను ఇష్టపడినప్పటికిని, అది నాకు పెద్ద విషయమేమీ కాదు. నేను కోరుకున్న ఆమోదం అల్లాహ్‌నుండి మాత్రమే. అలాగే నేను కోరుకునే ప్రేమ కూడా అల్లాహ్ నుండి మాత్రమే. అయినప్పటికినీ ఓ ప్రత్యేకమైన కారణమున్నా, లేకపోయినా చాలా మంది నన్ను ప్రేమిస్తున్న విషయాన్ని కనుగొన్నాను. అల్లాహ్ గనుక నిన్ను ప్రేమిస్తే, ఆయన ఇతరులను కూడా నిన్ను ప్రేమించేలా చేస్తారనే విషయం గుర్తుకు వచ్చి నేను సంతోషించాను. నేను అంత ప్రేమకు అర్హురాలిని కాదు. అంటే అది అల్లాహ్‌నుండి పొందిన మరొక కానుక. అల్లాహ్ శ్రేష్ఠుడు!''

**"దేవా! నా హృదయాన్ని జ్యోతిర్మయం చెయ్యి. నా కన్నుల్లో, నా చెవులలో, నా కుడివైపున, నా ఎడమవైపున, నా వెనుక, నా ముందు అంతటా వెలుగు నింపు. నా నరాల్లో, నా కండరాల్లో, నా రక్తంలో, నా రోమరోమంలో, నా చర్మంలో, నా నోటిలో, నా ఆంతర్యం అంతటా కాంతిమయం చెయ్యి. నాకు మహత్తర కాంతిని ప్రసాదించు. నన్ను నిలువెల్లా ప్రకాశవంతం చెయ్యి. నా పైనా, నా క్రిందా కాంతి నింపు. దేవా, నాకు ప్రకాశాన్నే ప్రసాదించు!" (బుఖారి)**

ఈమె జీవితం గురించి వ్యాసం వ్రాస్తున్నప్పుడు, ముహమ్మద్ (స) వారి కాలంలో ఇస్లాం ధర్మాన్ని అనుసరించిన మహిళలు జ్ఞాపకమొచ్చారు. ఇస్లాం ధర్మాన్ని ఆచరిస్తూ, ముహమ్మద్ (స) అడుగుజాడలలో నడుస్తూ 'ధర్మం యొక్క సౌందర్యాన్ని, అందరూ తెలుసుకునేలా చేసిన ఈ సోదరికి 'మోమిన్'కిచ్చే ప్రతిఫలాన్ని ప్రసాదించమని అల్లాహ్‌ను కోరుకుంటున్నాం (ఆమీన్).

*సోదరి ఆమినా అస్సిల్మి గారి అనుమతితో,*

సేకరణ మరియు తెలుగు అనువాదం :

**డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు (అబ్దుల్ కరీమ్)**

**P.S.**: ఈ వ్యాసంలో అందించిన వివరాలు, సోదరి 1993 ప్రాంతంలో వ్రాసుకున్న వ్యాసం లోనివి.

కేవలం ఒక్క సంవత్సరం మాత్రమే బ్రతికే అవకాశముందని డాక్టర్లు చెప్పిన విషయం చదివాక నాకు చాలా ఆవేదన కలిగింది. ఆమె త్యాగం మరియు ఆమె పడిన కష్టాలు తెలిసాక, ఆమె 'అల్లాహ్'పై పూర్తి భరోసాతో ఇహలోకం లోని ఎన్నో పరీక్షలలో అవలీలగా విజయం సాధించారని అనిపించింది.

అప్పటినుండి నాలో ఆతృత మొదలైంది. సోదరి క్షేమ సమాచారం కోసం సంబంధించిన అన్ని వెబ్‌సైట్లకు మెయిల్స్ పంపుతూనే ఉన్నాను. అలా 18 నెలలు గడిచాయి. అల్‌హమ్దులిల్లాహ్! అల్లాహ్ దయవలన సోదరి ఇప్పటికీ సజీవంగానే ఉన్నారని తెలిశాక నా ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

ఆమె వీడియో ఒకటి ఇంటర్‌నెట్‌లో చూశాను. ఇస్లాం స్త్రీకి ఎంత స్వేచ్ఛ నిచ్చిందో చెబుతుంటే, సోదరి ఇస్లాంని ఎంత చక్కగా అధ్యయనం చేశారో తెలిసింది.

ఆమె 'అల్లాహ్' మార్గంలో అందినదంతా ఖర్చు పెట్టారు. అనుకోకుండా ఇంటర్‌నెట్‌లో ఓ రోజు సిస్టర్ నదియా బీకున్‌గారి నోట్ ఒకటి చదవడం జరిగింది. అమెరికాలోని మాంద్యం ప్రభావం వలన ఆమినా అస్సిల్మి కొన్ని నెలలుగా ఇల్లులేకుండా గడుపుతున్నారని, ఆమె చేసిన ప్రసంగాల వీడియోలను, పుస్తకాలను అమ్ముకుని డబ్బు సంపాదించుకున్న పబ్లిషర్స్ ఎవరూ కూడా ఒక సెంట్ సహాయం చేయలేదని సోదరి నదియా వలన తెలిసింది. ఒకవైపు సోదరి 'బోన్ కాన్సర్'తో ఇంతవరకూ బ్రతికుండి, ధార్మిక సేవచేస్తున్నందుకు సంతోషం కలిగినా, మరోవైపు ఆమె పరిస్థితికి బాధ కలిగింది.

ఆమినా అస్సిల్మి ఎవరినీ సహాయం అడగరు. అల్లాహ్‌పై ఎంతో భరోసా కలిగి ఉన్నారు. ఆమె అడగకపోయినా సరే, చేయూత నివ్వవలసిన బాధ్యత విశ్వాసులపై ఉంది.

ప్రస్తుతం సోదరి ఉండటానికి ఇల్లు ఏర్పాటు చేయబడిందని, మరలా ఆమె దావా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నారని తెలిసింది.

ఇటీవల ఓ చోట ఆమె ప్రసంగిస్తుండగా, చాలామంది సిస్టర్స్ హఠాత్తుగా కలిసి, కొంత ఫండ్‌ను సేకరించడం జరిగింది. ఆ ఫండ్‌తో ఆమె ఉండటానికి తాత్కాలికంగా ఓ ఇల్లు ఏర్పాటయింది. కాని డొనేషన్స్‌లోని చాలా బాగాన్ని ఓ సెంటర్ ఏర్పాటు చేయడం కోసం ఆమె జమచేస్తున్నారు. ఆ సొమ్ము ముస్లిములందరికీ ఉపయోగపడాలని, ఎందుకంటే ఆ సొమ్ము అల్లాహ్‌పై నున్న భరోసా నుండే తనకు అందిందని భావిస్తున్నారామె.

మన రాష్ట్రప్రజల నుండి కూడా ఆమెకు సహాయం అందిస్తే బావుంటుందని, ప్రయత్నించి చూస్తానని సోదరి నదియాకు ఇమెయిల్ పంపాను. దానికి జవాబుగా 'మీ ప్రాంతంలో కష్టాలలో ఉన్నవారికి ఆ సహాయాన్ని అందించమని' చెబుతూ, ప్రస్తుతం సోదరి ఆమినా ఉండటానికి ఇల్లు ఏర్పాటు చేయబడిందని, మరలా ఆమె దావా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నారని తెలియజేశారు.

ఆమె జీవితగాథను మన శాంతిబాట మాసపత్రిక తొలి సంచికలో ప్రచురించకోవడానికి అనుమతి నడిగాను. సోదరి 'ఆమినా' సంతోషంతో అనుమతినిచ్చారు. సోదరి పంపిన ఇ-మెయిల్:

Assalamu alaikum:

Thank you for your kind words. If my story is of service, then I am happy..... I was between homes and did not have access to electricity, let alone internet. Sr. Nadia setup the new site for IUMW and my new email address, which I now am able to access on a regular basis, AlhamduAllah. I am once again travelling and teaching about Islam and Allah.

I have always maintained the IUMW office in my home and hope to be able to do so again before too long. The plan is for me to start writing more on the internet to help more people learn how to Live Islam. Please keep us in your prayers. Your assistance in spreading islam and the love of Allah is most appreciated.

I look forward to hearing from you.

Assalamu alaikum

Sister Aminah Assilmi
(June' 2009 Monday 9.12 a.m.)

సోదరి ఆమినా అస్సిల్మిని మీ దువాలలో జ్ఞాపకముంచుకోమని పాఠకులను మా శాంతిబాట టీమ్ తరపున హృదయపూర్వకంగా మనవి చేసుకుంటున్నాను.

---

## రుబా డి. కేవర్

హైస్కూలులో చదివేటప్పుడు నమాజ్ చేసుకునే ముస్లిం బాలికలను కాలితో తన్నే ఈ సోదరి జోర్డాన్‌లో జన్మించారు. ఈమె తండ్రి నాలుగు చర్చ్‌లకు ఫాదర్. ఈమె కూడా ముస్లిములని క్రైస్తవులుగా మార్చాలనే ధృడసంకల్పంతో ఉండేవారు. ఉన్నత విద్యకోసం అమెరికాలోని టెక్సాస్ వెళ్ళిన ఈమె, అక్కడ మొరాకోకు సంబందించిన ఓ ముస్లిం సోదరునితో జరిగిన డిబేట్, ఆమె జీవితాన్ని మార్చి వేసింది. ఈమె ఇస్లాంని స్వీకరించారు. ఇస్లాం ధర్మాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తూ, ఓ వెబ్‌సైట్‌ని కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఈ సోదరికి సంబంధించిన ఆసక్తికరమైన విశేషాలు వచ్చే సంచికలో...

**పాశ్చాత్య దేశాలలో స్త్రీలు సయితం 'మందు' (మద్యం) త్రాగడం దురలవాటుగా భావించరు.**

మితిమీరిన స్వేచ్ఛా సమాజంలో పుట్టిన వీరు, ఇస్లాం (శాంతి) ధర్మాన్ని స్వీకరించి, అన్ని దురలవాట్లను వదిలేసి, ఇస్లాం లోనే నిజమైన మనశ్శాంతి ఉందని సంతోషంతో చెబుతున్నారు. 'బురఖా' ప్రగతికి ప్రతిబంధకం కాదని వీరిని చూస్తే స్పష్టంగా తెలుస్తుంది కదా! వీరు ఇస్లాం స్వీకరించక పూర్వం, అక్కడి మిగతా స్త్రీల వలె బికినీలు, మినీ స్కర్ట్స్ మొ॥న అసభ్యకరమైన దుస్తులు ధరించినవారే! కాని ఇస్లాం నేర్పిన సంస్కారం, వారిని పూర్తిగా దుస్తులు ధరించేలా చేసింది. ఇందులో బలవంతం లేదు.

మితిమీరిన స్వేచ్ఛ నాగరికం అనుకుంటూ ఇన్నాళ్లూ అనాగరికంగా బ్రతుకుతూ నిజమైన 'స్త్రీ స్వేచ్ఛ' నిచ్చే ధర్మం గురించి తెలుసు కున్నారు.

**సుసాన్ కార్లాండ్**
(ఆస్ట్రేలియా)

**కేరోలైన్**
(లండన్)

**అమీనా**
(లండన్)
బస్ డ్రైవర్
ఇస్లాం ధర్మాన్ని స్వీకరించి 11 సం॥లు కావస్తుంది

**నికోల్ క్వీన్**
(అమెరికా)
ఇంటర్నెట్ ద్వారా ఇస్లాం గురించి తెలుసుకుని ఇస్లాం ధర్మంలోకి వచ్చారు

ఈ సిస్టర్స్ యొక్క వివరాలను ఇన్షాఅల్లాహ్ రాబోయే సంచికలలో అందించాలనుకుంటున్నాం.

---

**స్త్రీకి సంపూర్ణ స్వేచ్ఛను మరియు గౌరవాన్ని కలుగజేసిన దైవధర్మం - ఇస్లాం**

---

**భర్త తన భార్యకు వస్త్రం లాంటివాడని, అలాగే భార్య తన భర్తకు వస్త్రం లాంటిదని ఖుర్'ఆన్ వివరిస్తుంది.**